విద్యుత్ కావొద్దు విషాదం

- ప్రమాదాల నివారణకు ట్రాన్స్‌కో చర్యలు
- తక్కువ ఎత్తులోని ట్రాన్స్‌ఫార్మర్ల తొలగింపు
- దిమ్మెలు ఎత్తు పెంచి.. సిటీ మోడల్‌గా నిర్మాణం
- పర్యవేక్షించిన విద్యుత్ పట్టణ డీఈ తౌర్యానాయక్



వెంకటేశ్వర కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న ఏడీ తావుర్యా నాయక్



మోడల్ పిల్లర్‌పై ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్న సిబ్బంది

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యుత్ కావొద్దు విషాదం. పట్టణంలో చాలాచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇందులో చాలా చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు భూమికి చాలా తక్కువ ఎత్తులో ఉన్నాయి. ఇదే కాకుండా వాటికి రక్షణ కంచె లేక మనుషుల ప్రాణాలతోపాటు పశువులు, ఇతర మూగజీవాల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ముఖ్యంగా చౌరస్తాలు, రద్దీ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉన్నాయి. విద్యుత్ వైర్లు అవస్తవ్యస్తంగా ఉండటం.. ముళ్లపొదలు పేరుకు పోవడం.. చుట్టూ రక్షణ కంచెలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పట్టణంలో ఇలాంటి ప్రాంతాల్లో మూగజీవాలు మృతి చెందిన ఘటనలు కోకొల్లలు. ఇటీవల జడ్చర్లలో ఆడుకుంటూ ఓ చిన్నారి ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదంలో మృతిచెందింది. దీంతో విద్యుత్ శాఖ అప్రమత్తమై ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టింది.

64 ట్రాన్స్‌ఫార్మర్ల గుర్తింపు

ప్రమాదాలకు నిలవుగా మారిన తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెల ఎత్తు పెంచేందుకు విద్యుత్‌శాఖ శ్రీకారం చుట్టింది. జిల్లా కేంద్రంలో మొత్తం 390 ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా.. ఇందులో 64 ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండడం, ప్రమాదభరితంగా ఉన్నట్లు గుర్తించారు. ఇందులో అతి తక్కువ ఎత్తులో 34 ఉన్నట్లు విద్యుత్ శాఖ పట్టణ ఏడీ తౌర్య నాయక్ తెలిపారు. వీటిని మార్చేందుకు అనుమతులు కూడా వచ్చాయి. వీటిలో టౌన్ 1 పరిధిలో 9, టౌన్ 2 పరిధిలో 10, టౌన్ 3 పరిధిలో 15 ట్రాన్స్‌ఫార్మర్ల ఉన్నాయి. ఈ 34లో మంగళవారం వరకు 16 ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలను మార్చారు. ఈనెల చివరి నాటికి మిగిలిన వాటిని కూడా మార్చనున్నారు. కార్యక్రమాన్ని విద్యుత్ అధికారులు ప్రత్యేక డ్రైవ్‌గా నిర్వహిస్తుంది.

సిటీ మోడల్ దిమ్మెల ఏర్పాటు

ఇప్పటిదాక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రాళ్ల బేస్‌మెంట్ కట్టి దిమ్మెను ఏర్పాటు చేసే వారు. కాని దానికి విద్యుత్ శాఖ అధికారులు స్వస్తి చెప్పారు. హైదరాబాద్‌లాంటి నగరాలు, పెద్దపెద్ద పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు సిటీ మోడల్ దిమ్మెలను మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టారు. దీంతో ప్రమాదాలు జరుగకుండా నివారించవచ్చని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని సిటీ మోడల్‌లో ఏర్పాటు చేస్తే ప్రమాదాలు పూర్తిస్థాయిలో నివారించవచ్చు. కాంక్రీట్ పిల్లర్‌ను 10ఫీట్ల ఎత్తు వరకు నిర్మించి ఆ పిల్లర్‌పై బేస్ వేసే ప్రక్రియను విద్యుత్ భాషలో సిటీ మోడల్ అంటారు. లక్ష్మీనగర్‌కాలనీ, మర్లు, నలంద ఆటోస్టాండ్, శ్రీనివాసకాలనీ, వెంకటేశ్వర కాలనీ, జెడ్పీ కార్యాలయం, ఎంపీ డీకే అరుణ ఇంటి వద్ద ఇలా పలు కాలనీల్లో ఎత్తు దిమ్మెలను ఏర్పాటు చేశారు.

ప్రమాదభరితంగా 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్

జిల్లా కేంద్రంలోని మర్లు నుంచి యోగి టిఫిన్ సెంటర్ నుంచి పాల్‌కొండ వెళ్లే మార్గంలో 160 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రమాదభరితంగా ఉంది. దీన్ని మార్చేందుకు విద్యుత్ అధికారులు చర్యలు తీసుకున్నారు. స్థానిక ప్రజలు ఆ ట్రాన్స్‌ఫార్మర్ ను తొలగించేందుకు అడ్డుపడుతున్నట్లు తెలుస్తుంది.

> **ప్రజలు సహకరించాలి**
>
> సిటీ మోడల్ దిమ్మెల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలి. పట్టణంలో కొన్ని చోట్ల రోడ్డుపై ఉన్న ఇంటి యజమానులు సహకరించడం లేదు. విద్యుత్ ప్రమాదాల నివారణకు సిటీ మోడల్ ప్రక్రియను చేపడుతున్నాం. అందుకు ప్రజలు సహకరించాలి. దీంతో పూర్తిస్థాయిలో విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చు.
>
> –తావుర్యానాయక్, పట్టణ ఏడీ

కరాటేతో ఆత్మవిశ్వాసం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్



బెల్టులు పొందిన విద్యార్థులతో సంజీవ్ ముదిరాజ్

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని, కరాటే నేర్చుకోవడంతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ అన్నారు. కింగ్‌షోటోకాన్ ఫౌండర్ జహంగీర్ పాషా ఖాద్రీ ఆధ్వర్యంలో స్థానిక మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో ఆదివారం విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభచాటాలని కోరారు. జిల్లాకు చెందిన ఎంతోమంది క్రీడారంగంలో ఉన్నతస్థానాల్లో ఉన్నట్లు తెలిపారు. కరాటేలో బ్రౌన్‌బెల్టు అనేది ప్రాథమిక స్థాయిలాంటిదని, భవిష్యత్‌లో బ్లాక్‌బెల్టు స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కింగ్‌షోటోకాన్ ఫౌండర్ జహంగీర్‌పాషా ఖాద్రీ మాట్లాడుతూ.. కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షల్లో బ్రౌన్‌బెల్టులో 4, కలర్ బెల్టులో 13, పర్పుల్ బెల్టులో 3, బ్లూబెల్టులో 3, గ్రీన్‌బెల్టులో 5 మంది విద్యార్థులు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కింగ్‌షోటోకాన్ వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, బాలు మహేందర్‌నాయక్, అతహర్, అక్బర్, మొయిజ్, మహ్మద్ అమాన్, మహ్మద్ షరీఫ్, సాయిప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు డబ్బులు వేయకపోవడం దుర్మార్గం



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్

మహబూబ్‌నగర్ రూరల్: ఉపాధిహామీ కూలీలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటలాడుతూ కష్టపడి పనిచేసిన కూలీలకు కూలి డబ్బులు వేయకపోవడం దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రిప్రసాద్ మండిపడ్డారు. ఆదివారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. ఉపాధిహామీలో పనిచేస్తున్న కూలీలకు రెండునెలల పెండింగ్ డబ్బులు ఇవ్వాల్సి ఉండగా, అరకొర కూలి డబ్బులు మాత్రమే వేసి చేతులు దులుపుకొనే ప్రక్రియ చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఉపాధి సిబ్బందికి సైతం రెండు నెలల నుంచి వేతనాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కూలీల పెండింగ్ డబ్బులు, సిబ్బంది వేతనాలు విడుదల చేసి వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, నాయకులు లింగంగౌడ్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు విజయవంతం

హన్వాడ: ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు విజయవంతంగా అమలవుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. కేంద్రం నుంచి రూపాయి రాకున్నా.. అభివృద్ధి పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శించడంపై ఆయన స్పందిస్తూ లేనిపోని విమర్శలు మానుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో మండల నాయకులు షబ్బీర్, కృష్ణయ్య, శ్రీశైలం, వెంకటయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మన భవిష్యత్‌కు పునాది నాన్నే..



రాజాపూర్: మన ఆశలే తన ఆయువుగా.. మన గెలుపే తన లక్ష్యంగా మన జీవితాన్ని నిలబెట్టేందుకు నిత్యం శ్రమించే నిస్వార్థ శ్రామికుడు నాన్న అని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా తన స్వగ్రామమైన రంగారెడ్డిగూడకు వెళ్లి తండ్రి దిలీప్‌రెడ్డి ఫాదర్స్‌డే శుభాకాంక్షలు తెలిపి తండ్రికి ముద్దుపెట్టాడు. దీంతో ఆ తండ్రి కళ్లల్లో ఆనందం మాటల్లో చెప్పలేమన్నారు.

సీఎంతో ముఖాముఖికి హాజరుకావాలి

దేవరకద్ర: రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఆయా రైతు వేదికల్లో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఓ రాజేందర్ అగర్వాల్ తెలిపారు. దేవరకద్ర రైతువేదికలో సాయంత్రం 3గంటకు మండలంలో అన్నిగ్రామాల రైతులు హాజరుకావాలని కోరారు.

మిడ్జిల్: సీఎం ముఖాముఖీ కార్యక్రమనికి రైతులంతా ఆయా రైతువేదికల్లో అందుబాటులో ఉండాలని తహసీల్దార్ రాజు తెలిపారు.

కోయిల్‌కొండ: కోయిల్‌కొండ, శేరివెంకటాపూర్, గార్లపహాడ్ రైతువేదికలలో సోమవారం నిర్వహించే సీఎం ముఖాముఖి వీడియో కాన్ఫరేన్స్‌కు అంకిళ్ల, వింజమూర్, కొత్లాబాద్, మల్కాపూర్, తిర్మలంపల్లి రైతులు పాల్గొనాలని ఏవో యమారెడ్డి కోరారు.

విద్యార్థుల కూచిపూడి నాట్య ప్రదర్శన



చిన్నచింతకుంట: కౌకుంట్ల మండలం అప్పంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భాషా సాంస్కృతిక శాఖ, కలీం కళా వికసిత కల్చరల్ థియేటర్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు చేశారు. 40రోజులపాటు శిక్షణ పొంది ముగింపు రోజు ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థుల నాట్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ మురళీధర్‌రెడ్డి, అప్పంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు బెల్లం సాయిలు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ చెంత జనజాతర




నవాబ్‌పేట: మండలంలోని పర్వాతాపూర్ మైసమ్మ ఆలయం చెంత భక్త జన జాతర కొనసాగింది. ఆదివారం పెద్దఎత్తున భక్తులు అడవిలో వెలిసిన మైసమ్మ తల్లిని దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. అడవి మొత్తం అమ్మవారి నామస్మరణతో మారుమోగింది. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

పర్వతాపూర్ మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పూజారులు స్వాగతం పలికి అమ్మవారి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, మైసమ్మ ఆలయ చైర్మన్ జనగ్ మోహన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శంకర్‌నాయక్, అంజన్‌కుమార్, వెంకటయ్య, సత్యం, నర్సింహులు, బాలస్వామి, శ్రీనివాస్ ఉన్నారు.

స్నేహితుడికి చేయూత



మిడ్జిల్: తోటి స్నేహితుడు ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే అతడికి ఆర్థిక సాయం అందించి ఉపాధి చూపారు మిత్రబృందం. మండలంలోని రాణిపేటకు చెందిన ఆజాద్ యువజన సంఘం ఆధ్వర్యంలో మిత్రుడు ఖలీల్‌కు పంక్చర్ దుకాణం పెటించారు. దీనికిగాను ఆర్థికంగా సాయం చేసి అన్ని వస్తువులు కొనుగోలు చేసి ఉపాధి చూపారు. దీంతో యువజన సంఘం చేసిన సాయాన్ని పలువురు అభినందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లక్ష్మారెడ్డి, మహేశ్, ఆదిరెడ్డి, నిరంజన్, నర్సింహులు, ప్రకాశ్, వెంకటేశ్, తిరుపతి ఉన్నారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి



మహబూబ్‌నగర్ రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఎరుకల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ సదానందం అన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఎరుకల విద్యార్థులకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఆదివారం అంబేద్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు వై.నందిని ఇంటర్‌లో (975), నిహారిక పదిలో (567), పావని పదిలో (535)తోపాటు ఉత్తమ మార్కులు సాధించిన వారికి మెమెటో, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎరుకల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



హన్వాడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని ఏనెమీదితండాలో ఎస్టీసెల్ మోర్చ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ అంజయ్య, మండల అధ్యక్షుడు లింగన్న, నాయకులు సుబ్రహ్మణ్యం, సిల్వానాయక్, సురేందర్ నాయక్, విశాల్, సంతోష్, విఠల్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా ఉద్యమించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం

దేవరకద్ర: కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యిదర్శి సూర్యం పిలుపునిచ్చారు. ఆదివారం దేవరకద్ర మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించిన టీయూసీఐ జిల్లా ప్రథమ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులు ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం వాటిని సవరించి నాలుగు కోడ్‌లుగా మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా రూపొందించిందని ఆరోపించారు. కార్మికులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, చిన్న ఉద్యోగులకు ఉన్న చట్టాలు, హక్కులు రద్దయి బానిసలుగా మార్చబోతున్నదని విమర్శించారు. కేంద్రం కార్మికులపై అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను దేశవ్యాప్త సమ్మె, పోరాటాలతో ఉద్యమించాలని కోరారు.

మహాసభల పతాకావిష్కరణ

దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన టీయూసీఐ జిల్లా ప్రథమ మహాసభల సందర్భంగా వందలాది మంది కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ ఆవరణ వరకు ర్యాలీ కొనసాగించి కార్మికుల చిహ్నమైన సుత్తి, కొడవలి, ఎర్రజెండాను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు దేవదానం, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాంచందర్, అనుబంధ సంఘాల నాయకులు కొండారెడ్డి, వెంకటేశ్, అరుణ్‌కుమార్, వెంకటన్న, గణేశ్, అరుణక్క, వెంకట్రాములు, దాసు, బాలు, కొండన్న, పుట్టరాజు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం పేరుతో మోసం

- కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాధాకృష్ణ
- ముగిసిన జిల్లాస్థాయి శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న రాష్ట్ర సహాయ కార్యదర్శి రాధాకృష్ణ

మహబూబ్‌నగర్ రూరల్: అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లాస్థాయి సామాజిక శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మాణిక్యంరాజు ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ తరగతులకు రాధాకృష్ణ హాజరై మాట్లాడారు. సామాజిక న్యాయం పేరుతో బీజేపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్ దళితులకు కొన్ని పదవులు ఇచ్చి సామాజిక న్యాయంలో ముందున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. అనేక ఏళ్లుగా దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల సామాజిక అంశాలపైన కమ్యూనిస్టు పార్టీలు నిక్కచ్చిగా పని చేస్తున్నాయన్నారు. మిగతా పార్టీలన్నీ సామాజిక న్యాయం పేరుతో దళితులు, బలహీనవర్గాలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కుర్మయ్య మాట్లాడుతూ.. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీలకు 25శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ ఫీజు రద్దు చేయాలని, వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించాలన్నారు. ఈనెల 20, 21వ తేదీల్లో మండల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్క ఎస్సీ, ఎస్టీకి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలంటూ 30న మండల కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆది విష్ణువర్ధన్, నాయకులు బాలరాజు, వెంకట్రాములు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

మహబూబ్‌నగర్ రూరల్: జనన, మరణ, ఈడబ్ల్యూఎస్, ఆదాయం, స్థానిక, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల కోసం దళారులను ఆశ్రయించొద్దని మహబూబ్‌నగర్ అర్బన్ డీటీ దేవేందర్ కేసిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సంబంధించిన కుల, ఆదాయ, స్థానిక, ఈడబ్ల్యూఎస్ వంటి ధృవపత్రాలు ఏ రోజు కారోజు జారీ చేస్తున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలో ఎర్రవల్లి, బోయపల్లి, ఏనుగొండ, ఎదిర, పాలకొండ, మహబూబ్‌నగర్ రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, ఆయా రెవెన్యూ గ్రామాలకు సిబ్బందిని కేటాయించామని, వారితో పని చేయించుకోవాలన్నారు. జిల్లా కేంద్రం కావడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తుంటారని పేర్కొన్నారు. సర్టిఫికెట్లకు ప్రజలు నేరుగా దరఖాస్తు చేసుకోవాలని, సిబ్బంది ఇబ్బంది పెడితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. దళారులు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని, ప్రజలకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.

రైతుభరోసాకు 20వరకు అవకాశం

నవాబుపేట: కొత్తగా రైతుభరోసాకు ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఏఓ కృష్ణకిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఈనెల 5వ తేదీనాటికి భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు తాజాగా దరకాస్తులకు అర్హులని వివరించారు. గతంలో రైతుభరోసా వచ్చినవారు దరకాస్తు చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ డీలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ ఏ గ్రూప్‌లోకి మార్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల్లోకి ముదిరాజ్ మహిళలు రావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మహిళా విభాగం కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ముదిరాజ్ మహాసభ మహిళా జిల్లా అధ్యక్షురాలు తెలుగు రాధ, ఉపాధ్యక్షురాలు వాకిటి లక్ష్మి, వైష్ణవి, సుజాత, తెలుగు పావని, ప్రధాన కార్యదర్శిగా పసుల రమాదేవి, కార్యదర్శులుగా తెలుగు సువర్ణ, గొడుగు శారద, సంయుక్త కార్యదర్శులుగా సున్నాల లక్ష్మి, పిట్టల లక్ష్మి, కృష్ణవేణి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా అనుపటి అలివేల, అంజలి, ప్రచార కార్యదర్శిగా వరలక్ష్మి, కోశాధికారిగా పిల్లి జయమ్మ, కార్యవర్గ సభ్యురాళ్లుగా ఎల్లమ్మ, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి ఎన్నికయ్యారు.

వారం రోజులుగా తాగునీటి సరఫరా బంద్



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగర శివారులోని రాంరెడ్డిగూడెం ఫిల్టర్ బెడ్ వద్ద స్లూయిస్ మరమ్మతుకు గురికావడంతో సుమారు వారం రోజులుగా తెలంగాణచౌరస్తా, కోర్టురోడ్డు, తెలంగాణకాలనీ, సుభాశ్‌నగర్, క్రిష్టియన్‌కాలనీల్లో తాగునీరు సరఫరా కావడంలేదు. ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పద్మావతీ కాలనీ పెట్రోల్ బంక్‌కు ఎదురుగా మెయిన్ రోడ్డు పక్కన కొన్ని నెలల క్రితమే లీకేజీ ఏర్పడింది. దీని వల్ల మిషన్ భగీరథ పథకం నుంచి తాగునీరు వదిలినప్పుడు లక్ష్మీనగర్‌కాలనీకి వెళ్లేదారిలో వృథాగా వెళ్తోంది. వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జ్ ఎంఈ సందీప్‌వరల్డ్‌ను వివరణ కోరగా ఆదివారం రాంరెడ్డిగూడెం వద్ద మరమ్మతు పనులు పూర్తయ్యాయన్నారు. ఆయా ప్రాంతాలకు తాగునీటిని పునరుద్ధరిస్తున్నామన్నారు. అలాగే లక్ష్మీనగర్‌కాలనీకి వెళ్లే గల్లీ వద్ద లీకేజీని త్వరలోనే బాగు చేయిస్తామన్నారు.

ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం

చిన్నచింతకుంట: మండలంలోని పెద్దవడ్డెమాన్ జీపీ కార్యాలయం వెనక భాగంలో రైతు సత్యనారాయణ పొలంలో రెండు నెలల కిందట గాలీవానకు వ్యవసాయ పొలాలకు వెళ్లే విద్యుత్ స్తంభం ఒరిగి వైర్లు వేలాడుతూ.. ప్రమాదభరితంగా మారాయి. ప్రస్తుతం వర్షాలు కురిసినప్పుడు విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు రాలుతూ.. సమీప రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అంతేకాక విద్యుత్ లైన్ ఇలా ఉండడంతో లైన్‌కు సంబంధించిన రైతులు నారుమడులు సిద్ధం చేసుకోలేక పోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని పలువురు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రమాదాలు సంభవించకముందే విద్యుత్ స్తంభం, వైర్లను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.



పెద్దవడ్డెమాన్‌లో సత్యనారాయణ పొలంలో ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ స్తంభం

సుదీర్ఘ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు



పూలే, అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మందకృష్ణ, ఎమ్మెల్యే విజయుడు

ఉండవెల్లి: సుదీర్ఘ 60 ఏళ్ల న్యాయ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు కేంద్ర, రాష్ట్రాల్లో ప్రవేశపెట్టడం ఉద్యమంలో కీలకం అని ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ పోరాటం మాలలకు వ్యతిరేకం కాదని, అన్ని కులాలకు సమన్వయంగా ఉంటామని అన్నారు. ఆదివారం మండలంలోని కలుగోట్ల గ్రామంలో మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేద్కర్ విగ్రహావిష్కరణలను మంద కృష్ణతోపాటు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఐజీ సుమతి ఆవిష్కరించారు. దేశంలో రాష్ట్రపతిగా కేఆర్ నారాయణ్ ఉన్న సమయంలో ఎస్సీ వర్గీకరణకు తీర్మానం చేశారని, గతంలో వర్గీకరణ అంశాన్ని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కమిషన్ వేశారన్నారు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వంలో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ పోరాటం న్యాయమే అని భావించి.. మాదిగలకు అండగా నిలిచారన్నారు. శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఒక్క ఎమ్మెల్యే కూడా వ్యతిరేకించలేదంటే ఎమ్మార్పీఎస్ పోరాటమే కారణమన్నారు. ఐజీ సుమతి మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి విద్యను అభ్యసించేలా పాఠశాల ముందు మహనీయులను ఏర్పాటు చేశారంటే మార్పు మొదలైందని అర్థమవుతుందన్నారు. అందరు సమానత్వంతో, సామరస్యంగా ఉంటేనే గ్రామం బాగుంటుందని, అందరూ ఉన్నత స్థితికి ఎదిగి జీవితాలలో వెలుగులు తేవాలని కోరారు. అన్ని భాషాలు ఉన్న ఈ దేశంలో అందరిని కలిపిన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అని ఐజీ కొనియాడారు. ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ గ్రామంలో యువత ఆదర్శంగా తీసుకుని జ్యోతిరావుపూలే, అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు.ఎమ్మార్పీఎస్ నాయకులు మస్తాన్, భీమన్న, రాజు, ఎలీషా పాల్గొన్నారు.